
సాక్షి తూర్పుగోదావరి

గురువారం । 4 । ఏప్రిల్ । 2024



చిన్న నిర్లక్ష్యం.. ప్రాణానికే ప్రమాదం

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో లక్షల ఎకరాల్లో వరిసాగు జరుగుతుంది. వ్యవసాయం ప్రధాన వృత్తిగా ఉన్న ఈ జిల్లాల్లో అనేక మంది సాగు పనులపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. IIలో



డెల్టాకు 5,550 క్యూసెక్కులు

ధవళేశ్వరం: గోదావరి డెల్టా కాలువలకు బుధవారం 5,550 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 1,500, మధ్య డెల్టాకు 1,250, పశ్చిమ డెల్టాకు 2,800 క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద 5.75 అడుగుల నీటి మట్టం కొనసాగుతోంది.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ బుధ (సా॥)	సెహరీ గురు (ఉ॥)
రాజమహేంద్రవరం	6.25	4.33
కాకినాడ	6.25	4.33
అమలాపురం	6.25	4.32

న్యూస్‌రీల్

ఆ వృద్ధుని మృతికి టీడీపీ మూల్యం చెల్లించుకోక తప్పదు

ఎంపీ భరత్ రామ్



ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: ప్రతీ నెలా ఒకటో తేదీన పెన్షన్ అందుకునే ఆ వృద్ధుని మృతికి టీడీపీ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని రాజమహేంద్రవరం ఎంపీ, వైఎస్సార్‌సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్ రామ్ అన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కాకినాడ జిల్లా తూరంగిలో కె. వెంకట్రావు (70) పెన్షన్ ఇప్పట్లో అందదని తెలుసుకుని తీవ్ర ఆందోళనకు గురై గుండెపోటుతో మృతి చెందాడన్నారు. విషయం తెలుసుకున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మానవత్వంతో మృతుని కుటుంబానికి రూ.5 లక్షలు మంజూరు చేశారన్నారు. వలంటీర్లపై ఆదిరెడ్డి వాసు కక్ష సాధింపు చర్య ఫలితంగానే కాకినాడ రూరల్ తూరంగిలో వృద్ధుడు మరణించాడని, రాష్ట్రంలో ఇంకెంతమంది వృద్ధుల ప్రాణాలను టీడీపీ బలి తీసుకుంటుందోనని ఆందోళన వ్యక్తం చేశారు. అవ్వాతాతలు, దివ్యాంగులకు పెన్షన్ల పంపిణీని ఆపుచేయించింది నేనే అని మీడియా వద్ద పెద్ద ఘన కార్యం చేసేసినట్లు ప్రగల్భాలు పలికిన ఆదిరెడ్డి వాసు 24 గంటలు కాకుండానే నాలుక కరుచుకోవడంతో ఆయన రాజకీయ పరిజ్ఞానం ఏపాటిదో అర్థం అవుతోందన్నారు. అంటే రాష్ట్రంలో అవ్వాతాతలకు, దివ్యాంగులకు పెన్షన్లు అందకుండా చేసింది ఈ వాసుయే అన్నారు. ఏప్రిల్ నెలలోకి అడుగుపెట్టి మూడు రోజులు దాటిపోతున్నా పెన్షన్ చేతికందకపోవడంతో పండుటాకులు విలవిల్లాడిపోతున్నారన్నారు.

జిల్లాలో 40 శాతం పింఛన్ల పంపిణీ

సచివాలయాల వద్ద టెంట్‌లు, కుర్చీల ఏర్పాటు



పిడింగొయ్యి గ్రామ సచివాలయం-1లో పింఛన్లు పంపిణీ చేస్తున్న సచివాలయ ఉద్యోగులు

రాజమహేంద్రవరం రూరల్: జిల్లాలో తొలి రోజు బుధవారం 40 శాతం మంది సామాజిక భద్రత పింఛను దారులకు రూ.29.26కోట్లు మేర పెన్షన్ సొమ్ము పంపిణీ చేశామని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత తెలిపారు. జిల్లా పరిధిలో ఉన్న 2,43,831 మందికి పెన్షన్ లబ్దిదారులకు రూ.72,39 కోట్లు అందజేయాల్సి ఉండగా బుధవారం రాత్రి 8 గంటల వరకు 95,819 మందికి రూ.29.26 కోట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. అన్ని గ్రామ,వార్డు సచివాలయాలు వద్ద టెంట్,కుర్చీలు ఏర్పాటుతో పాటు పింఛన్‌దారులకు ఇబ్బంది కలుగకుండా అధికార యంత్రాంగం మంచినీటి సదుపాయం కల్పించిందన్నారు. ఈ నెల 6 తేదీ వరకు పింఛన్లను సచివాలయాల ద్వారా పంపిణీ చేస్తామన్నారు. మంచం పట్టిన రోగులకు, 40శాతం పైబడి ఉన్న దివ్యాంగ పెన్షన్ దారులకు వారి ఇంటి వద్దనే పెన్షన్ పంపిణీ చేస్తామన్నారు.

సేవకు ఇచ్చే విలువ ఇదేనా..?

కాకినాడ: కరోనా వంటి విపత్కర సమయంలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పనిచేశాం. ప్రతీ ఇంటిలో ఒక సభ్యునిగా మమేకమై సేవలు అందించాం. ప్రభుత్వ పథకాలను లబ్ధిదారుల గడప వద్దకే చేర్చాం. ముఖ్యంగా అవ్వాతాతలకు ఒకటో తేదీ తెల్లవారక ముందే పింఛన్లను ఇంటికి తీసుకువెళ్లి అందించాం. ఇంత సేవ చేస్తే మాకు ఇచ్చే గౌరవం ఇదేనా? అంటూ కాకినాడ జిల్లా కేంద్రం కాకినాడ సిటీకి చెందిన వలంటీర్లు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. జనసేన-టీడీపీ నాయకుల వ్యవహారశైలిపై తీవ్రస్థాయిలో అసహనం వ్యక్తం చేశారు. తమ కారణంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి చెడ్డపేరు రాకూడదనే ఉద్దేశంతో బుధవారం మూకుమ్మడి రాజీనామాలు చేశారు. వివరాల్లోకి వెళ్తే జిల్లా కేంద్రం కాకినాడలోని దాదాపు 84 సచివాలయాల పరిధిలో సుమారు 1,500 మందికి పైగా వలంటీర్లు పనిచేసేవారు. ప్రభుత్వ మార్గదర్శకాలు, ఆదేశాలకు అనుగుణంగా ఇంతకాలం సమర్థంగా పని చేశారు. టీడీపీ కుట్రల నేపథ్యంలో వలంటీర్లను పక్కనపెడుతూ ఎన్నికల కమిషన్ తీసుకున్న నిర్ణయం కారణంగా వలంటీర్ల పరిస్థితి గడచిన కొద్ది రోజులుగా దుర్భరంగా మారిందంటూ ఇక్కడి వలంటీర్లు వాపోయారు. సొంత పనిపై ఇంట్లో నుంచి బయటకు వచ్చినా వలంటీర్లు రాజకీయ ప్రచారాలు చేస్తున్నారంటూ తమను లక్ష్యంగా చేసుకుని దుష్ప్రచారం చేస్తున్నారంటూ వాపోయారు. ప్రతిపక్షాల వ్యవహార శైలితో సొంతపనిపై కూడా ఇంట్లో నుంచి బయటకు రాలేని దుర్భర పరిస్థితిని ఎదుర్కొంటున్నామంటూ ఆవేదన వ్యక్తం చేశారు. తమ కారణంగా సీఎంకు చెడ్డపేరు రావడం ఇష్టంలేదని, అందువల్ల మూకుమ్మడి రాజీనామాలు చేస్తున్నామంటూ కాకినాడలోని దాదాపు 400 మంది బుధవారం ఒకేసారి మూకుమ్మడి రాజీనామాలు చేశారు. సంబంధిత లేఖలను నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ కార్యాలయానికి అందజేశారు.

పాలన రథం.. ప్రగతి పథం

- తూర్పుగోదావరి జిల్లా ఆవిర్భవించి రెండేళ్లు పూర్తి
- ప్రజలకు మరింతగా చేరువైన పాలన
- స్పందనతో తగ్గిన వ్యయప్రయాసలు
- అందుబాటులో అధికార యంత్రాంగం
- పారిశ్రామిక ప్రగతికి సోపానం
- మెడికలల సాకారం.. అందుబాటులోకి 150 సీట్లు
- విపత్తుల సమయంలో సమర్థంగా అధికారుల సేవలు



కొవ్వూరు మండలం కాపవరంలో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ కె.మాధవీలత(ఫైల్)

సాక్షి, రాజమహేంద్రవరం: పాలనా వికేంద్రీకరణతో ప్రగతి సాధ్యమని భావించారు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. తద్వారా ప్రజలకు సుపరిపాలన అందించే మహోన్నత ఆశయంతో జిల్లాల పునర్విభజనకు నాంది పలికారు. పార్లమెంట్ నియోజకవర్గాన్ని జిల్లాగా మార్చారు. 2 రెవెన్యూ డివిజన్లు, 19 మండలాలు, 7 నియోజకవర్గాలు, 2,561 చదరపు కిలోమీటర్లు, 18.32 లక్షలకు పైగా జనాభాతో నవ్య తూర్పుగోదావరి జిల్లా ఆవిర్భవించింది. జిల్లా కేంద్రంగా చారిత్రక, సాంస్కృతిక రాజధానిగా ఖ్యాతి గడించిన రాజమహేంద్రవరం ఎంపికైంది. కొత్త జిల్లా గురువారానికి రెండేళ్లు ముగించుకుని మూడో ఏడాదిలోకి అడుగు పెడుతున్న సందర్భంగా ప్రత్యేక కథనం.

పాలన మరింత చేరువ


జిల్లాల విభజన జరిగిన వెంటనే ప్రభుత్వ పాలన ప్రజలకు మరింతగా చేరువైంది. బొమ్మూరు న్యాక్ భవనంలో నూతన కలెక్టరేట్ ఏర్పాటైంది. 28 శాఖల కార్యాలయాలు ఏర్పాటయ్యాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాగా ఉన్న సమయంలో ప్రజలకు వివిధ సమస్యలపై కాకినాడ కలెక్టరేట్‌కు వెళ్లాలంటే దూరాభారమయ్యేది. బస్సు చార్జీలు, భోజన ఖర్చులు తడిసి మోపెడయ్యేవి. ప్రస్తుతం ఏ ప్రాంతం నుంచైనా జిల్లా కేంద్రానికి త్వరగా చేరుకునే వెసులుబాటు కలిగింది. సంక్షేమ పథకాలు పకడ్బందీగా అమలు చేసేందుకు మార్గం సుగమమైంది. జగనన్న ఇళ్ల నిర్మాణం వేగంగా సాగుతోంది. ఎక్కడ చిన్నపాటి సమస్య తలెత్తినా వెంటనే అధికారులు అక్కడికి చేరుకోగలుగుతున్నారు. గతంలో కలెక్టర్‌ను కలవాలంటే గగనమే. ప్రస్తుతం కలెక్టరే తమ గ్రామాలకు వస్తుండటంతో ప్రజా సమస్యలు రోజుల వ్యవధిలోనే పరిష్కారమవుతున్నాయి.

విపత్తుల వేళ ప్రజలకు అండగా..

గోదావరి వరదలు, భారీ వర్షాలు ఏటా ఉమ్మడి జిల్లాను అతలాకుతలం చేసేవి. ఆస్తి, ప్రాణ నష్టం వాటిల్లేది. కలెక్టర్ క్షేత్ర స్థాయికి వెళ్లాలంటే వందల కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సి వచ్చేది. జిల్లా విభజనతో కలెక్టర్ ప్రతి నియోజకవర్గం, మండలం, గ్రామానికి ఎక్కువ సార్లు పర్యటించే వెసులుబాటు కలిగింది. వెరసి గతేడాది గోదావరి వరదలను జిల్లా యంత్రాంగం సమర్థంగా ఎదుర్కొన్నారు. కలెక్టర్ కె.మాధవీలత వరద ప్రభావితమైన ప్రతి గ్రామాన్ని సందర్శించి ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లకుండా అధికారులు, సిబ్బంది, ప్రజలకు దిశా నిర్దేశం చేశారు. మిచాంగ్ తుపాను సమయంలో అన్నదాతకు అధికారులు అండగా నిలిచారు. జిల్లా వ్యాప్తంగా తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు వరి, ఇతర పంటలు నీట మునిగాయి. ఖరీఫ్ కోతలున్న నేపథ్యంలో ధాన్యం తడసి రైతులు నష్టపోకుండా ప్రభుత్వం అండగా నిలిచింది. జిల్లా కలెక్టర్లతో సహా జిల్లా స్థాయి అధికారులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు, వలంటీర్లను క్షేత్ర స్థాయికి పంపి గింజ కూడా నష్టపోకుండా కొనుగోలు చేసి అండగా నిలిచింది. ఆన్‌లైన్‌లో ప్రక్రియ ఆలస్యమవుతుందని ఆఫ్‌లైన్‌లో కొనుగోళ్లు చేపట్టింది.

అభివృద్ధికి నాంది

- నవ్య తూర్పుగోదావరి జిల్లాలో అనేక అభివృద్ధి పనులకు నాంది పడింది. వాటిలో మచ్చుకు కొన్ని... రాజమహేంద్రవరంలో రూ.475 కోట్ల వ్యయంతో మెడికల్ కళాశాల నిర్మించారు. ఈ విద్యా సంవత్సరం నుంచి 150 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులోకి వచ్చాయి. ప్రస్తుతం వైద్య విద్యను అభ్యసించాలంటే ఖరీదైన విషయం. డబ్బున్న వారు ఇతర ప్రాంతాలు, దేశాల్లో తమ పిల్లలకు రూ.కోట్లు ఖర్చుపెట్టాల్సిన పరిస్థితి. అంతటి ప్రాధాన్యం ఉన్న విద్యా విధానంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారు.



తూర్పుగోదావరి జిల్లా మ్యాప్

- పేదల సొంతింటి కల సాకారమైంది. జిల్లా వ్యాప్తంగా 1.46 లక్షల మందికి ఉచితంగా ఇంటి పట్టాలు అందజేశారు. తొలి దశలో రూ.113.48 కోట్లతో 63,000 ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. వీటిలో సింహభాగం పూర్తవగా.. మరికొన్ని వివిధ దశల్లో పురోగతిలో ఉన్నాయి.

పారిశ్రామిక రంగం పరుగులు

నూతనంగా ఆవిర్భవించిన తూర్పుగోదావరి జిల్లాలో పారిశ్రామిక రంగం పరుగులు పెట్టింది. అనపర్తి నియోజకవర్గం బలభద్రపురంలో రూ.2500 కోట్లతో గ్రాసిమ్ కాస్టిక్ సోడా పరిశ్రమ స్థాపించారు. 2,500 మందికి ఉపాధి దక్కుతోంది. ఇది మరింత విస్తరించే దిశగా చర్యలు చేపట్టారు.

- గోకవరం మండలం గుమ్మళ్లదొడ్డి వద్ద రూ.260 కోట్లతో ఇథనాల్ ప్లాంట్‌కు శంకుస్థాపన జరిగింది. ప్రస్తుతం వీటి పనులు వేగంగా జరుగుతున్నాయి. త్వరలోనే పరిశ్రమ అందుబాటులోకి వస్తుంది. పరిశ్రమ నిర్మాణం పూర్తయితే 210 మందికి పైగా నిరుద్యోగులకు ఉపాధి దక్కుతుంది.
- కొవ్వూరు మండలం ఇసుకపట్ల పంగిడి గ్రామం వద్ద మరో భారీ పరిశ్రమకు నాంది పలికారు. 26.65 ఎకరాల విస్తీర్ణంలో రూ.1,350 కోట్ల పెట్టుబడితో త్రివేణి రెన్యువబుల్స్ సంస్థ ఆధ్వర్యంలో సోలార్ గ్లాస్ తయారీ పరిశ్రమకు అడుగులు పడ్డాయి. పరిశ్రమ ద్వారా 2,400 మందికి ఉద్యోగాలు దక్కాయి.
- నల్లజర్ల మండలం పోతవరం గ్రామంలో 14 ఎకరాల్లో జాగృతి బయోటెక్ ప్రైవేటు సంస్థ ఆధ్వర్యంలో బయోటెక్నాలజీ కంపెనీ అందుబాటులోకి రానుంది. రూ.50 కోట్ల పెట్టుబడితో నిర్మిస్తున్న ఈ సంస్థ పూర్తి స్థాయిలో రూపుదిద్దుకుంటే 81 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

స్పందనతో సాంత్వన

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో సమస్యల పరిష్కారం కోసం వంద, రెండు వందల కిలోమీటర్ల దూరం నుంచి కాకినాడ కలెక్టరేట్‌కు వచ్చేవారు. ప్రతి సోమవారం నిర్వహించే స్పందనలో తమ బాధలను అధికారులకు విన్నవించుకునే వారు. జిల్లాల విభజనతో అర్జీదారులకు ఉపశమనం కలిగింది. ఏ ప్రాంతం నుంచి వచ్చినా దూరం తక్కువగా ఉండటంతో ఉదయం వచ్చి మధ్యాహ్నానికి తమ సమస్యలు చెప్పి వెనుదిరుగుతున్నారు. ఫలితంగా స్పందన అర్జీల్లో పరిష్కార పురోగతి పెరిగింది. జిల్లా ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు వివిధ సమస్యలపై ఏడాదికి 15 వేలకు పైగా అర్జీలు అందగా.. వాటిలో 97 శాతం అర్జీలకు పరిష్కారం లభిస్తోంది.

ఎంఎస్ఎంఈలతో ఉపాధి

ప్రభుత్వం గడిచిన నాలుగున్నరేళ్లుగా ఎంఎస్ఎంఈలతో ఉపాధి కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తోంది. ఏడాది వ్యవధిలోనే 6 వేల ఎంఎస్ఎంఈలు స్థాపించాలన్నది లక్ష్యంగా కాగా.. 2023లో 2,427 ఎంఎస్ఎంఈలు ఏర్పాటయ్యాయి. రూ.39.557 లక్షల మేర పెట్టుబడులు వచ్చాయి. 10,179 మందికి ఉపాధి దక్కింది. 2024లో ఇది మరింతగా అభివృద్ధి చెందింది.

ఇదీ ముఖచిత్రం

జిల్లా	తూర్పుగోదావరి
విస్తీర్ణం:	2,561 చ.కి.మి
రెవెన్యూ డివిజన్లు	2
మండలాలు	19
రెవెన్యూ విలేజీలు	272
గ్రామ పంచాయతీలు	300
జనాభా	18,32,332 (సుమారు)
ఓటర్లు	16,08,504
పురుషులు	7,85,631
స్త్రీలు	8,22,779
ఇతరులు	94

రాజమహేంద్రి రాత మారింది

రాజమహేంద్రవరం అభివృద్ధి పుష్కరకాలానికి అన్న నానుడిని దూరం చేసి.. రాజమహేంద్రవరం నగర అభివృద్ధిపై సీఎం ప్రత్యేక దృష్టి సారించారు. ఎంపీ మార్గాని భరత్, కలెక్టర్ కె.మాధవీలత, మున్సిపల్ కమిషనర్ నేతృత్వంలో నాలుగున్నరేళ్ల కాలంలో నగర రూపురేఖలు మారిపోయాయి. ప్రజలకు ఆహ్లాదాన్ని పంచడమే కాకుండా.. మురుగుకాలువల నిర్మాణం, రహదారులు బాగుకు కృషి చేశారు. ఇందుకు ఒక్క రాజమహేంద్రవరం నగరానికే సుమారు రూ.423 కోట్లు వెచ్చించారంటే ఏ స్థాయిలో అభివృద్ధి జరిగిందో అర్థం అవుతుంది.

ప్రతి గడపకూ ఎమ్మెల్యేలు

గడప గడపకు ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యేలు ప్రతి గడపా తడుతున్నారు. ప్రజలకు అవసరమైన పనులు చేపడుతున్నారు. ఇందులో భాగంగా 735 పనులకు కలెక్టర్ ఆమోద ముద్ర వేశారు. రూ.26.52 కోట్లు వెచ్చించనున్నారు. ఈ పనులు ఇప్పటికే సింహభాగం పూర్తయ్యాయి.


సంతృప్తికర సేవలు

పాలన వికేంద్రీకరణ నేపథ్యంలో తూర్పుగోదావరి జిల్లాకు తొలి కలెక్టర్‌గా రావడం సంతోషంగా ఉంది. రెండేళ్ల పాటు ప్రజలకు సంతృప్తికర సేవలు అందించాం. క్షేత్ర స్థాయి పర్యటనలతో అధికారుల్లో జవాబుదారీతనం పెంపొందించాం. స్పందన అర్జీలపై ప్రత్యేక దృష్టి పెట్టి 90 శాతానికి పైగా పరిష్కారం చూపుతున్నాం. ఇక ముందూ ఇదే స్ఫూర్తితో పనిచేస్తాం. ప్రస్తుతం సార్వత్రిక ఎన్నికలు ముందున్న సవాలు. ప్రశాంత ఎన్నికల నిర్వహణే లక్ష్యంగా అడుగులు వేస్తున్నాం. ఆ దిశగా ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు వ్యవహరిస్తున్నాం.

\- కె.మాధవీలత, జిల్లా కలెక్టర్

ఎన్నికల నిర్వహణకు పార్టీలు సహకరించాలి

- ప్రచారం కోసం అనుమతులు తప్పనిసరి
- నామినేషన్‌పై సందేహాల నివృత్తి కోసం ప్రత్యేక విభాగం
- జిల్లాలో ఎనిమిది చోట్ల చెక్ పోస్టుల ఏర్పాట్లు
- కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి మాధవీలత



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మాధవీలత తదితరులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ విడుదలకు సమయం సమీపిస్తున్న నేపథ్యంలో నామినేషన్లు, అఫిడవిట్ నమూనా పత్రాలు అందుబాటులో ఉంచామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి మాధవీలత తెలిపారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ త్వరలో నోటిఫికేషన్ విడుదల చేయనున్న దృష్ట్యా, ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను అనుసరించి నామినేషన్ స్వీకరణ ప్రక్రియ చేపట్టామని తెలిపారు. సరైన విధానంలో నామినేషన్లు దాఖలు చేయాల్సి ఉంటుందన్నారు. అసంపూర్తిగా, తప్పులతో నామినేషన్‌ను దాఖలు చేస్తే ఎన్నికలలో పోటీ చేసే అవకాశం కోల్పోవలసి ఉంటుందని తెలియజేశారు. నామినేషన్లు, అఫిడవిట్ తదితర అంశాలపై సందేహాలు నివృత్తి చేయటం కోసం ప్రత్యేక విభాగం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలో కొత్త ఓటర్లుగా నమోదు కోసం ఫారం -6 ద్వారా, ప్రస్తుత ఓటర్లు చిరునామా మార్పు, ఓటు బదిలీ కోసం ఫారం 8 అవకాశం ఏప్రిల్ 14 వరకు ఉందని తెలిపారు. కొందరు ఓటు బదిలీ కోసం కాకుండా కొత్తగా ఓటు కోసం ఫారం 6 దరఖాస్తు చేసుకోవడం తమ దృష్టికి వచ్చిందని అన్నారు. ఓటర్‌గా ఒక చోట ఓటు ఉంటే కేవలం ఫారం 8 ద్వారా మాత్రమే బదిలీ, చిరునామా మార్పు కోసం పరిగణనలోకి తీసుకోనున్నట్లు తెలిపారు. జిల్లాలో ఎనిమిది చెక్ పోస్టుల ద్వారా నిఘా పెట్టామని, ఇప్పటి వరకు నగదు, మద్యం, వస్తువులకు సంబంధించిన సుమారు రూ.78 లక్షల విలువ కలిగిన వాటినీ సీజ్ చేసినట్లు తెలిపారు. జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహులు, రాజమహేంద్రవరం పార్లమెంటు ఏఆర్వో ఆర్.కృష్ణనాయక్, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

మంత్రి వేణు విజయానికి కృషి

మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నేత ముద్రగడ పద్మనాభం పిలుపు



మంత్రి వేణును కలసిన ముద్రగడ పద్మనాభం. చిత్రంలో యువజన విభాగం రీజినల్ కోఆర్డినేటర్ జక్కంపూడి గణేష్

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గంలో రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ గెలుపునకు కృషిచేయాలని పార్టీశ్రేణులకు మాజీమంత్రి, వైఎస్సార్‌సీపీ నేత ముద్రగడ పద్మనాభం పిలుపునిచ్చారు. బుధవారం బొమ్మూరులోని వైఎస్సార్‌సీపీ రూరల్ నియోజకవర్గ కార్యాలయంలో ఆయన మంత్రి వేణుగోపాలకృష్ణను మర్యాదపూర్వకంగా కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ముద్రగడను రూరల్ నియోజకవర్గం నుంచి అధికసంఖ్యలో పార్టీశ్రేణులు మర్యాదపూర్వకంగా కలిసి ఆయనతో ఫొటోలు దిగారు. ముద్రగడ విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం జగన్‌ను, రూరల్‌లో మంత్రి వేణును ప్రజలంతా ఆశీర్వదిస్తే రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి జరుగుతుందన్నారు. సీఎం జగన్ పాలనలోనే పేద ప్రజల ఐదు వేళ్లు నోటిలోకి వెళుతున్నాయన్నారు. పేద ప్రజల మనసు ఎరిగిన ముఖ్యమంత్రి సంక్షేమ పథకాల ద్వారా మేలు చేస్తున్నారని అన్నారు. చంద్రబాబుపాలనలో ఏనాడు అయినా పేద ప్రజల ఐదు వేళ్ల నోటిలోకి వెళ్లే పథకాలను అమలు చేశారా అని ప్రశ్నించారు. మరోసారి సీఎం జగన్ రామరాజ్యం వస్తే పేద ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. మాజీ ఎంపీ గిరిజాల వెంకటస్వామినాయుడు, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పీకే రావు, రాష్ట్ర యువజన విభాగ రీజనల్ కోఆర్డినేటర్ జక్కంపూడి గణేష్, మాజీ వైస్ ఎంపీపీ నక్కా రాజబాబు, ప్రముఖ న్యాయవాది గొందేశి శ్రీనివాసులరెడ్డి, పార్టీపెద్దాపురం నియోజకవర్గ పరిశీలకులు గిరిజాలవీర్రాజు(బాబు), నగరపాలకసంస్థ డివిజన్ల క్లస్టర్ అధ్యక్షుడు మింది నాగేంద్ర, జేసీఎస్ కన్వీనర్లు తాటికొండ విష్ణుమూర్తి, తాడాల చక్రవర్తి, కొప్పిసిడిప్రసాద్‌బాబు(రాజమౌళి), రాష్ట్రకాపు కార్పొరేషన్ డైరెక్టర్ ముద్దాల అను, రాష్ట్ర ఎస్‌ఆర్‌డెక్యాప్‌డైరెక్టర్ అంగాడి సత్యప్రియ, జిల్లా దివ్యాంగులసెల్ అధ్యక్షుడు ముత్యాలపోసికుమార్ పాల్గొన్నారు.

కోతలు లేని చేతల పాలన

- పవర్ ఫుల్ సప్లై
- మండుతున్న ఎండలు.. పెరుగుతున్న విద్యుత్ వినియోగం
- ముందస్తు ప్రణాళికతో సరిపడా సరఫరా
- బ్రేక్ డౌన్‌ల సమస్యే లేకుండా పర్యవేక్షణ
- వ్యవసాయానికి 9 గంటల ఉచిత విద్యుత్

సాక్షిప్రతినిధి,కాకినాడ: వేసవి ప్రారంభంలోనే సూరీడు చుర్రుమంటున్నాడు. భగభగమంటోన్న భానుడు ప్రతాపంతో విద్యుత్ వినియోగం ఒక్కసారిగా పెరిగిపోయింది. ఈ ఏడాది వేసవి ఠారెత్తిస్తుందనే సంకేతాలతో ఏపీఈపీడీసీఎల్ అప్రమత్తమై తీసుకున్న ముందస్తు చర్యలతో కోతలు లేకుండా విద్యుత్ సరఫరా చేయగలుగుతున్నారు. లేదంటే గత పాలనాకాలంలో మాదిరిగా విద్యుత్ ఎప్పుడుంటుందో ఎప్పుడు పోతుందో తెలియని అయోమయం ఉండేది.

అందుకు భిన్నమైన విధానంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో గృహ, పారిశ్రామిక, వ్యవసాయ రంగాలకు పుష్కలంగా విద్యుత్‌ను సరఫరా చేయగలుగుతున్నారు. డిమాండ్‌కు తగ్గట్టుగా విద్యుత్ సరఫరా జరుగుతోంది. మెట్ట ప్రాంతంలో విద్యుత్ మోటార్లపై ఆధారపడి సాగవుతోన్న పంట పొలాలకు ప్రతిబంధకాలు లేకుండా షెడ్యూల్ ప్రకారం తొమ్మిది గంటలు విద్యుత్ సరఫరా చేస్తున్నారు.



ఇటీవలనే చార్జి చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

పెరుగుతున్న వినియోగం

ఉమ్మడి తూర్పుగోదావరిలో గడచిన మూడు నెలలుగా విద్యుత్ వినియోగం పెరుగుతూ వస్తోంది. జనవరి నెలలో 451 మిలియన్ యూనిట్లు వినియోగం ఉంటే అది ఫిబ్రవరికి వచ్చేసరికి 477.5, మార్చిలో 541.5 మిలియన్ యూనిట్లకు చేరుకుంది. వినియోగం రోజువారీ చూసుకుంటే జనవరిలో 15 మిలియన్ యూనిట్లు, ఫిబ్రవరిలో 16.3, మార్చిలో 17.4 మిలియన్ యూనిట్లు నమోదైంది. ఉమ్మడి తూర్పులో ఫిబ్రవరి నుంచి విద్యుత్ వినియోగం పెరుగుతూ వచ్చింది. వచ్చే రెండు, మూడు నెలల్లో రోజువారీ వినియోగం 23 మిలియన్ యూనిట్లకు పెరుగుతుందని ఏపీఈపీడీసీఎల్ అధికారులు అంచనా వేశారు. ఇందుకు తగ్గట్టుగా ఎక్కడా విద్యుత్ సరఫరాకు ప్రతిబంధకం లేకుండా ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. వేసవి తీవ్రత పెరిగి ఉష్ణోగ్రతలు 30 డిగ్రీలు పైనే నమోదువుతున్న క్రమంలో చిన్న, మధ్యతరగతి అని తేడా లేకుండా ప్రతి ఇంటిలోను ఏసీలు వినియోగిస్తున్నారు. ఫలితంగా విద్యుత్ గృహవినియోగం బాగా పెరిగింది. మెట్ట ప్రాంతంలో సాగవుతోన్న పంటలకు పగటి పూట తొమ్మిది గంటలు విద్యుత్ సరఫరాకు ఎక్కడా ఆటంకాలు లేకుండా చూస్తున్నారు. అలాగే గృహ అవసరాలకు 24 గంటలు సరఫరా చేస్తున్నారు. పట్టణాలు, పల్లెలు అనే తేడా లేకుండా విద్యుత్ కోతలు అనే మాట లేకుండా సరఫరా జరుగుతోంది. గతంలో గృహ వినియోగంతో పాటు వ్యవసాయానికి సరిపడా విద్యుత్ అందక రైతులు, సామాన్యులు ఇబ్బంది పడేవారు. ఇప్పుడు అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌లు, ఫీడర్‌లతో నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయగలుగుతున్నారు. గత మూడేళ్లుగా తీసుకువచ్చిన విద్యుత్ సంస్కరణలు ఇందుకు దోహదం చేశాయి.

వ్యవసాయానికి తొమ్మిది గంటలు విద్యుత్ ఉచితంగా అందివ్వడంలో ఎక్కడా లోటు రానివ్వడం లేదు. తూర్పుగోదావరి, కాకినాడ జిల్లాల్లో కొంత సాగు బోర్లపై ఆధారపడి ఉంది. ఉమ్మడి జిల్లా మొత్తంగా రైతులు వినియోగిస్తోన్న 63,751 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల ద్వారా ఏటా 574 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగిస్తున్నారు. రైతులు వినియోగించే విద్యుత్ కోసం ప్రభుత్వం రాయితీల రూపంలో ఏటా సుమారు రూ.389 కోట్లు వెచ్చిస్తోంది. గతంలో ట్రాన్స్‌ఫార్మర్ పాడైతే రైతులు రోజుల తరబడి పునరుద్ధరణ కోసం నిరీక్షించే పరిస్థితి. ఆ పరిస్థితిలో ఇప్పుడు పూర్తిగా మార్పు వచ్చింది. ఉమ్మడి తూర్పులో 84,508 ట్రాన్స్‌ఫార్మర్‌లు వినియోగంలోకి తీసుకువచ్చారు. ట్రాన్స్‌ఫార్మర్‌లు ఎక్కడైనా దెబ్బతింటే తక్షణం పునరుద్ధరించేందుకు వీలుగా 1,887 ట్రాన్స్‌ఫార్మర్‌లు సిద్ధంగా ఉండటం విశేషం. గడచిన మూడేళ్లలో ట్రాన్స్‌ఫార్మర్ల వైఫల్యాల శాతాన్ని 5.62కు తీసుకు రాగలగడం గమనార్హం. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 33 కేవీ, 11 కేవీ ఫీడర్స్ 1,146 వరకు ఉన్నాయి. వీటిలో కూడా ఒకటి, అరా సాంకేతిక లోపంతో బ్రేక్ డౌన్ అవుతున్నా రెండు, మూడు గంటల్లోనే పునరుద్ధరించగలుగుతున్నామని కమర్షియల్ ఏడీఈ వెంకటేశ్వరరావు తెలియచేశారు.

ఇదీ కనెక్షన్లు లెక్క..

గృహవినియోగం	16.70 లక్షలు
వాణిజ్యం	1,93,613
వ్యవసాయం	63,751
పారిశ్రామికం	6,314
హెచ్‌టీ 11కేవీ	1,292
వీధిలైట్‌లు, మంచినీటి కుళాయిలు	41,0000

వినియోగం పెరిగినా విద్యుత్ కోతలు లేవు



ప్రస్తుతం వేసవిలో ఉష్ణోగ్రతలు పెరిగిపోవడంతో విద్యుత్ వినియోగం కూడా పెరిగింది. ఇందుకు తగ్గట్టుగా విద్యుత్ సరఫరాలో ఎక్కడా అటంకాలు లేకుండా చేయగలుగుతున్నాం. పెరుగుతున్న విద్యుత్ వినియోగాన్ని ముందుగానే అంచనా వేయడంతో తగ్గ ఏర్పాట్లు చేస్తున్నాం. సర్కిల్ పరిధిలో ఎక్కడా విద్యుత్ కోతలు అనేవి లేవు. డిమాండ్‌కు తగ్గ సరఫరా చేయగలుగుతున్నాం. ట్రాన్స్‌ఫార్మర్లు ఎక్కడా బ్రేక్ డౌన్ లేకుండా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

పీఎస్ఎస్ మూర్తి,
సూపరింటెండెంట్ ఇంజినీర్,
ఏపీఈపీడీసీఎల్ సర్కిల్,
రాజమహేంద్రవరం

క్లుప్తంగా

తండ్రికి తలకొరివి పెట్టిన కుమార్తె



తండ్రి అంతిమయాత్రలో కుమార్తె దుర్గ

ఉండ్రాజవరం: ఆ తండ్రికి కూతురే అన్ని తానై తలకొరివి పెట్టింది. ఉండ్రాజవరంలో బుధవారం ఈ ఘటన జరిగింది. గ్రామంలోని చేనేత సామాజిక వర్గానికి చెందిన వ్యవసాయ కూలీ రేగు శ్రీనివాసు (40) బుధవారం గుండె పోటుతో మృతి చెందాడు. అతడికి ఇద్దరు కుమార్తెలు. దీంతో రెండో కుమార్తె దుర్గ తండ్రికి తలకొరివి పెట్టింది. ఆ బాలిక ఉండ్రాజవరం జూనియర్ బాలికల కాలేజీలో ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు రాసింది.

టిప్పర్ స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న మట్టి టిప్పర్

కిర్లంపూడి: అక్రమ మట్టి రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై షేక్ జబీర్ హెచ్చరించారు. అనధికారికంగా మట్టిని రవాణా చేస్తున్న టిప్పర్‌ను మంగళవారం అర్ధ రాత్రి సింహాద్రిపురం అడ్డురోడ్డులో పోలీసులు పట్టుకున్నారు. అనుమతి పత్రాలు లేకపోవడంతో కేసు నమోదు చేసి తహసీల్దార్ కార్యాలయానికి రిపోర్టు పంపారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

కిర్లంపూడి: లారీ ఢీకొని రైస్‌మిల్లు మేనేజర్ మృతి చెందాడు. ఎస్సై షేక్ జబీర్ తెలిపిన వివరాల ప్రకారం.. ప్రత్తిపాడు మండలం చిన శంకర్లపూడి గ్రామానికి చెందిన లొండా వెంకటరమణ (33) గుర్రంపాలెంలోని బాలాజీ రైస్ మిల్లులో మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం రాత్రి విధులు ముగించుకుని స్వగృహానికి వెళుతుండగా, బూరుగుపూడి వద్ద జాతీయ రహదారిపై రాజమహేంద్రవరం వైపు నుంచి అన్నవరం వైపు వెళుతున్న ఏపీ39యూకె 8285 నంబర్ గల లారీ ఢీకొంది. ఈ ఘటనలో వెంకటరమణ తలకు తీవ్ర గాయాలై అక్కడే కుప్పకూలిపోయాడు. అతడిని జగ్గంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో చనిపోయాడు. మృతుడి భార్య వీరలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. వెంకటరమణకు ఇద్దరు సంతానం.

చిన్న నిర్లక్ష్యం.. ప్రాణానికే ప్రమాదం

- మందుల పిచికారీలో అప్రమత్తత అవసరం
- కనీస జాగ్రత్తలతో రక్షణ
- రైతులకు వ్యవసాయాధికారుల సూచన

ఆలమూరు: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో లక్షల ఎకరాల్లో వరిసాగు జరుగుతుంది. వ్యవసాయం ప్రధాన వృత్తిగా ఉన్న ఈ జిల్లాల్లో అనేక మంది సాగు పనులపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. వరిసాగులో ఇటీవల వివిధ రకాల తెగుళ్లు విజృంభిస్తున్నాయి. వీటి నివారణకు రైతులు విరివిగా పురుగు మందులను పిచికారీ చేస్తున్నారు. కొందరు రైతులు అవగాహన లేక పంటలపై పురుగుమందులు చల్లేటప్పుడు కనీస జాగ్రత్తలు తీసుకోవడం లేదు. దీనివల్ల ఒక్కోసారి పురుగుమందుల ప్రభావానికి గురై ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఆలమూరు ఏడీఏ కె.నాగేశ్వరరావు పలు సూచనలు చేశారు. క్రిమి సంహారక మందులు పిచికారీ చేస్తున్నప్పుడు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వ్యవసాయశాఖ సూచనలకు అనుగుణంగా సేఫ్టీ సూట్ ధరించి పిచికారీ చేస్తే ఎటువంటి ప్రాణాపాయం, అనారోగ్యం కలగదన్నారు. పురుగు మందుల ప్రభావం మూడు రకాలుగా శరీరంలోకి ప్రవేశిస్తుందని తెలిపారు.





కనీస జాగ్రత్తలు పాటించకుండా క్రిమి సంహారక మందులను పిచికారీ చేస్తున్న రైతు

ముక్కు నుంచి: క్రిమి సంహారక మందుల నుంచి వెలువడే విష వాయువులను పీల్చడం ద్వారా విషం శరీరంలోకి ప్రవేశిస్తుంది.

చర్మం ద్వారా: పురుగు మందుల మోతాదు ఎక్కువైనపుడు ఒకొక్కసారి విష వాయువు చర్మం ద్వారా శరీరంలోకి ప్రవేశించే వీలుంది. శరీరంపై పుండ్లు, గాయాలు ఉంటే ఈ తీవ్రత మరింత అధికంగా ఉంటుంది.

నోటి ద్వారా: క్రిమి సంహారక మందులు పిచికారీ చేసిన తర్వాత శుభ్రంగా చేతులు కడుక్కోవాలి. లేకపోతే తినే ఆహార పదార్థాలు కలుషితమై, నోటి ద్వారా విషం శరీరంలోకి ప్రవేశిస్తుంది. మందులు పిచికారీ చేస్తూ పొగ తాగినా, విషం వాయువు రూపంలో శరీరంలోకి వెళ్లే ప్రమాదం ఉంది.

జాగ్రత్తలు తప్పనిసరి

క్రిమి సంహారక మందులను పిచికారీ చేసేటప్పుడు ఏదైనా ప్రమాదం సంభవిస్తే ఈ కింద తెలిపిన జాగ్రత్తలను అనుసరించి చికిత్స చేయించుకుంటే త్వరిత గతిన కోలుకుంటారని వైద్యులు చెబుతున్నారు.

- చర్మం ద్వారా విష పదార్థాలు శరీరంలోకి ప్రవేశిస్తే వెంటనే సబ్బు నీటితో శుభ్రం చేయాలి. ఒక వేళ కంటిలో పడితే మంచినీటితో కడగాలి. అనంతరం సమీప వైద్యుడి వద్దకు వెళ్లి చికిత్స తీసుకోవాలి.
- పురుగు మందును ముక్కుతో పీల్చి ప్రమాదానికి గురైన వ్యక్తిని గాలి, వెలుతురు ఎక్కువగా తగిలే ప్రదేశంలో ఉంచాలి. శ్వాస తీసుకోవడం ఇబ్బందికరంగా ఉంటే కృత్రిమ శ్వాసను అందించే ఏర్పాటు చేయాలి. వీలైనంత త్వరగా సమీప ఆరోగ్య కేంద్రానికి తీసుకువెళ్లి ప్రాథమిక చికిత్స అందించాలి. క్రిమి సంహారక మందు నోటి ద్వారా కడుపులోకి వెళ్లినప్పుడు వాంతి చేయించే మార్గాలను అన్వేషించాలి. గ్లాసు నీళ్లలో ఉప్పు లేదా ఆవాల పొడిని తగినంత మోతాదులో కలిపి తాగించాలి. కడుపు ఖాళీ అయ్యే వరకూ అలా తాగిస్తూనే ఉండాలి. అనంతరం వైద్యుడి వద్దకు తీసుకువెళ్లి చికిత్స చేయించాలి.

విస్తృత అవగాహన



పురుగు మందుల పిచికారీ చేస్తున్నప్పుడు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలి. వ్యవసాయశాఖ సూచనల మేరకు చర్యలు తీసుకుంటే పిచికారీలో సంభవించే ప్రమాదాన్ని తప్పించుకోవచ్చు. దీనిపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం.

– కె.నాగేశ్వరరావు, ఏడీఏ ఆలమూరు

గ్రామస్తుల దాడిలో గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

కొవ్వూరు: దొంగ అనే అనుమానంతో ఒక వ్యక్తిని స్తంభానికి కట్టేసి కొట్టడంతో ప్రాణాలు కోల్పోయాడు. కొవ్వూరు మండలం సీతంపేటలో మంగళవారం అర్ధరాత్రి ఈ సంఘటన జరిగింది. వివరాల్లోకి వెళితే.. గ్రామంలోని ఆకుల నర్సవేణి ఇంటికి మంగళవారం అర్ధరాత్రి దాటాక సుమారు ఒంటి గంట సమయంలో గుర్తుతెలియని వ్యక్తి వచ్చాడు. ఆమె భయపడి గట్టిగా కేకలు వేసింది. దీంతో స్థానికులు అతడిని వెంబడించి పట్టుకుని, అక్కడే స్తంభానికి కట్టి కొట్టారు. ముఖంపై బలంగా దెబ్బలు తగలడంతో అతడు అక్కడికక్కడే పడిపోయాడు. వెంటనే కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కొవ్వూరు ప్రభుత్వ సామాజిక ఆసుపత్రి మార్చురీకి తరలించారు. మద్దూరులంక వీఆర్వో బండి వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్సై కె.సుధాకర్ కేసు నమోదు చేశారు. ఆయన మాట్లాడుతూ మృతుడికి సుమారు 50 నుంచి 55 ఏళ్ల వయసు ఉంటుందన్నారు. అతడి ఒంటిపై నిక్కరు మాత్రమే ఉందని, మరే ఇతర ఆధారాలు లభ్యం కాలేదన్నారు. నాలుగు రోజులుగా సమిశ్రగూడెం పరిసర ప్రాంతాల్లో తనలో తానే మాట్లాడుకుంటూ తిరిగేవాడని తెలిసిందన్నారు.

సత్యదేవుని ధ్వజస్తంభం తొలగింపు

- 22న నూతన స్తంభం ప్రతిష్ఠ
- ముమ్మరంగా జరుగుతున్న పనులు

అన్నవరం: సత్యదేవుని ఆలయంలో ధ్వజస్తంభం తొలగింపు పనులు బుధవారం పూర్తయ్యాయి. నూతన ధ్వజస్తంభం ప్రతిష్ఠించేందుకు నాలుగు రోజులుగా ఈ పనులు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా మంగళవారం ధ్వజస్తంభానికి గల వెండి తొడుగును తొలగించారు. బుధవారం కర్రను ముక్కలుగా కోసి కిందకు దించారు. దేవస్థానం ఈఈ కె.రామచంద్రమోహన్, ఈఈ నరసింహారెడ్డి, డీఈ ఉదయ్ తదితరులు పనులను పర్యవేక్షించారు. కాగా.. నూతన ధ్వజస్తంభం ప్రతిష్ఠ ఈనెల 22న జరగనుంది. నెల్లూరుకు చెందిన ఒక భక్తుడి కుటుంబ సభ్యులు 130 మంది నూతన స్తంభం ప్రతిష్ఠకు, దానికి బంగారు తాపడం చేసేందుకు అయ్యే వ్యయాన్ని భరిస్తున్నారు. వీటికి రూ.నాలుగు కోట్లు ఖర్చవుతుందని అంచనా. ఇప్పటికే నూతన ధ్వజస్తంభం కర్రను సేకరించి దేవస్థానానికి తీసుకువచ్చారు.



ధ్వజస్తంభం తొలగించిన తర్వాత మిగిలిన దిమ్మ

చేపూరులో రేషన్ షాపుపై విజిలెన్స్ దాడులు

తుని రూరల్: తుని మండలం చేపూరులో పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా రవాణా చేస్తున్నారనే సమాచారంతో విజిలెన్స్, రెవెన్యూ, సివిల్ సప్లయిస్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. గ్రామస్తుల నుంచి అందిన సమాచారంతో చౌకధరల దుకాణాన్ని పరిశీలించారు. నాలుగో నంబర్ చౌక ధరల దుకాణం వద్ద మినీ వ్యాన్‌లో పది క్వింటాళ్ల రేషన్ బియ్యం లోడ్ చేస్తుండగా గుర్తించారు. అనకాపల్లి జిల్లా పాయకరావుపేటకు చెందిన డ్రైవర్ కం మినీ వ్యాన్ యజమాని అడపా రామరాజును విచారించగా చౌకధరల దుకాణంలో అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కొత్తూరు నర్సింగరావు సూచనల మేరకు రేషన్ బియ్యం లోడ్ చేస్తున్నట్టు వెల్లడించాడు. అనంతరం దుకాణాన్ని, ఎండీయూ వాహనాన్ని తనిఖీ చేయగా రికార్డుల్లో ఉండాల్సిన నిల్వల కంటే తక్కువ ఉన్నట్టు గుర్తించారు. మొత్తం 2,650 కిలోలు బియ్యం, 87 కిలోల పంచదార, ఆరు కిలోల గోధుమ పిండి, మినీ వ్యాన్‌ను సీజ్ చేశారు. వాహనాన్ని అప్పగించి, డ్రైవర్‌పై క్రిమినల్ కేసు నమోదుకు తుని రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీజ్ చేసిన సరుకులను ఎస్.చామవరం డీలర్‌కు, రేఖవానిపాలెంలో ఎఫ్‌సీఐ గోడౌన్‌కు అప్పగించారు. ఇంటింటా రేషన్ సరుకులను సరఫరా చేసే ఎండీయూ వాహనాన్ని తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. తనిఖీలో విజిలెన్స్ అధికారులు జగన్నాథరెడ్డి, విజయకుమార్, సీఎస్ డీటీ వీరాస్వామి, జీవానందం, వీఆర్వో ఎరురు పాక శ్రీను పాల్గొన్నారు.



అధికారులు సీజ్ చేసిన రేషన్ బియ్యం, మినీ వాహనం

పక్షుల కోసం వరి కంకణం



వరి కుచ్చులను తయారు చేస్తున్న కూలీలు



రైతుకు వరి కుచ్చు అందజేస్తున్న దాలి నాయుడు



వివిధ ఆకృతుల్లో తయారు చేసిన వరి కంకుల కుచ్చులు

- విశ్రాంతి ఉపాధ్యాయుడి తపన
- వివిధ ప్రదేశాల్లో కుచ్చుల ఏర్పాటు

తుని: మానవుడు ఆకలి, దప్పికను మాటలతో వ్యక్తపరుస్తాడు. మూగజీవులకు ఆ అవకాశం లేదు. ఆహారం కోసం మైళ్ల దూరం ప్రయాణిస్తూ ఉంటాయి. ఇటువంటి వాటి ఆకలి దప్పికలు తీర్చడానికి విశ్రాంతి ఉపాధ్యాయుడు దాలి నాయుడు వరి కంకణానికి శ్రీకారం చుట్టారు. తన సొంత పొలంలో పండిన వరిని కంకులుగా కూలీలతో తయారు చేయించి, వాటిని ఆలయాల్లో తోరణాలుగా కట్టారు. తుని పట్టణంలోని గొట్టుముక్కల వారి వీధిలో తాను నివాసం ఉంటున్న ఇంటి పైభాగంగా పదుల సంఖ్యలో వరి కంకులను కుచ్చుగా తయారు చేసి కట్టారు. వీటిని పక్షులు ఆహారంగా తీసుకుంటున్నాయని ఆయన వివరించారు. ఇంతటితో వదిలి వేయకుండా హరిత వికాస్ ఫౌండేషన్ ఏర్పాటు చేసి రైతులను చైతన్య పరిచి గ్రామాల్లోని ఆలయాలు, కమ్యూనిటీ భవనాల దగ్గర వరి కుచ్చులను కట్టించారు. పక్షులకు అనువుగా ఉండేలా వివిధ ఆకారాల్లో తయారు చేయించిన దాలి నాయుడును అందరూ అభినందిస్తున్నారు.



కేతఈ చిన్నాయిపాలెం అమ్మవారి ఆలయంలో ఏర్పాటు వరి తోరణం

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

నల్లజర్ల: దూబచర్ల సమీపంలో బైపాస్ రోడ్డుపై మోటారు సైకిల్‌పై వస్తున్న ఇద్దరిని గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. నల్లజర్ల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సుభద్రపాలెం గ్రామానికి చెందిన బోడపాటి రాజేష్ (22), బిరుదుగడ్డ సునీల్ స్నేహితులు. రాజేష్ వరికోత మెషీన్‌పై పనిచేస్తున్నాడు. తన యజమాని వద్ద జీతం తీసుకోవడానికి స్నేహితుడితో కలిసి మోటారు సైకిల్‌పై వెళ్లాడు. అనంతరం స్వగ్రామానికి తిరిగి వస్తుండగా దూబచర్ల సమీపంలో వెనుక నుంచి వాహనం ఢీకొంది. ఈ ఘటనలో బైక్ నడుపుతున్న రాజేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. వెనుక కూర్చున్న సునీల్‌కు తీవ్రగాయాలు కావడంతో 108లో కొయ్యలగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎస్సై వెంకట సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



బోడపాటి రాజేష్ (ఫైల్)

జాతీయ పోటీలకు స్వాతిశ్రీ



యానాం: బీహార్ రాజధాని పాట్నాలో ఈనెల 6 నుంచి 9 వరకూ జరిగే 67వ జాతీయస్థాయి స్కూల్స్ (అథ్లెటిక్స్) పోటీలకు స్థానిక సాయి జూనియర్ కళాశాల విద్యార్థిని ఒగ్గు నాగ స్వాతిశ్రీ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఎం.లోవరాజు బుధవారం తెలిపారు. స్వాతిశ్రీ పుదుచ్చేరి జట్టులో సభ్యురాలుగా పోటీల్లో పాల్గొంటుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినిని చైర్మన్ నల్లం నాగబాబు తదితరులు అభినందించారు.

యువకుడిపై అత్యాచారం కేసు

కరప: మండలంలో కొంగోడు గ్రామానికి చెందిన యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఓ యువకుడిపై కరప పోలీసులు అత్యాచారం కేసు నమోదు చేశారు. వివరాలు.. కొంగోడు గ్రామంలోని యువతి ఇంటి సమీపంలోనే పిల్లి భీమేష్ అనే యువకుడు ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో గత ఏడాది జనవరి 10న యువతికి మాయమాటలు చెప్పి అత్యాచారం చేశాడు. అప్పటి నుంచి శారీరకంగా ఆమెను కలుస్తున్నాడు. ఆ యువతికి గర్భం దాల్చడంతో ఎవరికీ తెలియకుండా అబార్షన్ చేయించాడు. అనంతరం ఆమెకు దూరంగా ఉంటున్నాడు. యువతి, కుటుంబ సభ్యులు ఈ విషయమై పెద్దలతో పంచాయతీ పెట్టగా, రూ.30 లక్షలు కట్నం ఇస్తేనే పెళ్లి చేసుకుంటామని ఆ యువకుడు, అతడి తల్లిదండ్రులు తేల్చిచెప్పారు. దీంతో బాధితురాలు బుధవారం కరప పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు నిందితుడిపై అత్యాచారం, అబార్షన్, కట్నం వేధింపులు తదతర సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్టు ఎస్సై టి.రామకృష్ణ తెలిపారు. కాకినాడ రూరల్ సీఐ శ్రీనివాస్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

15 నుంచి సముద్రంలో చేపలవేట నిషేధం

అమలాపురం రూరల్: సముద్ర జలాల్లో ఈ నెల 15 నుంచి జూన్ 14 తేదీ వరకూ చేపల వేటను నిషేధిస్తూ పశుసంవర్ధక, డెయిరీ డెవలప్‌మెంట్, మత్స్య శాఖలు బుధవారం ఉత్తర్వులు జారీ చేశాయని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మత్స్యశాఖాధికారి ఎన్.శ్రీనివాసరావు తెలిపారు. యాంత్రిక పడవలు, మేకనైజ్డ్, మోటారు బోట్ల ద్వారా జరిగే అన్ని రకాల చేపల వేటను 61 రోజుల పాటు నిషేధించారన్నారు. సంతానోత్పత్తి కాలంలో తల్లి చేపలు, రొయ్యలను సంరక్షించడం, వాటి సంతతి పెరుగుదలను ప్రోత్సహించడం ద్వారా మత్స్య సంపదను పెంపొందించేందుకు ఈ నిషేధం విధించారని తెలిపారు. ఈ మేరకు మత్స్య కారులు సహకరించాలని కోరారు. నిషేధ ఉత్తర్వులను ఉల్లంఘించిన బోట్ల యజమానులకు ఆంధ్రప్రదేశ్ సముద్ర మత్స్య క్రమబద్ధీకరణ చట్టాన్ని అనుసరించి శిక్ష పడుతుందన్నారు. అలాగే బోట్లు, మత్స్య సంపదను స్వాధీనం చేసుకుని జరిమానా విధిస్తారన్నారు. చేపలవేట నిషేధం సక్రమంగా అమలయ్యేందుకు మత్స్య శాఖ, కోస్ట్ గార్డ్, కోస్టల్ సెక్యూరిటీ పోలీసులు, నేవీ, రెవెన్యూ అధికారులతో గస్తీ ఏర్పాటు చేస్తామన్నారు.

నేడు ప్రో - కార్ట్ రేసింగ్ ఫైనల్

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య కళాశాల క్యాంపస్‌లో మూడు రోజులుగా జరుగుతున్న జాతీయ స్థాయి ప్రో -కార్ట్ రేసింగ్ సీజన్-4 పోటీలు గురువారంతో పూర్తి కానున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి 13 టీమ్ సభ్యులు పాల్గొని వారి ప్రతిభను చూపుతున్నారన్నారు. గురువారం స్పీడ్ విభాగం, తదితర అంశాలపై విజేతలను నిర్ణయించి, బహుమతులు అందజేయనున్నట్టు తెలిపారు. బుధవారం ఆటోక్రాస్, స్కిడ్ పేడ్, బ్రేక్ టెస్ట్ తదితర అంశాలను పరిశీలించామన్నారు.



వాహనాలను పరిశీలిస్తున్న నిపుణులు

నేటి నుంచి అంగన్‌వాడీల కేంద్రాల పనివేళల్లో మార్పు

అమలాపురం రూరల్: పెరుగుతున్న ఎండల దృష్ట్యా అంగన్‌వాడీ కేంద్రాల పనివేళల్లో మార్పులు చేస్తూ ప్రభుత్వ స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆదేశాలు జారీ చేసిందని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ సాధికారిత అధికారి డాక్టర్ ఎం.ఝాన్సీరాణి తెలిపారు. గురువారం నుంచి మే 31 వరకూ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మాత్రమే కేంద్రాలు పనిచేస్తాయన్నారు. మధ్యాహ్న భోజనం అనంతరం చిన్నారులను ఇంటికి పంపేస్తారన్నారు. కేంద్రాల్లో తాగునీరు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. మే ఒకటి నుంచి 15 వరకూ అంగన్‌వాడీ కార్యకర్తలు, మే 16 నుంచి 30 వరకు అంగన్‌వాడీ సహాయకులు వేసవి సెలవులు తీసుకోవచ్చన్నారు. లబ్ధిదారులకు అనుబంధ పోషకాహారం అందడంలో ఎటువంటి అంతరాయం కలగకుండా చూసుకోవాలన్నారు.

ఉరి వేసుకుని యువతి ఆత్మహత్య

పెదపూడి: యువతి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన కైకవోలులో చోటుచేసుకుంది. ఎస్ఐ శోభన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం తాళ్లరేవు మండలం పాత కోరంగికి చెందిన తాతపూడి సత్తిబాబు, అతడి కుమార్తె సత్యవతి (22) కైకవోలు గ్రామంలోని ఆక్వా చెరువుల వద్ద పనిచేస్తూ అక్కడే నివాసముంటున్నారు. బుధవారం ఉదయం సత్యవతి కడుపు నొప్పి, ఇతర అనారోగ్య కారణాలతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. తండ్రి సత్తిబాబు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పీఎంపీలకు ప్రథమ చికిత్సపై శిక్షణ

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): పల్లెల్లో ప్రాథమిక వైద్యసేవలు అందించే పీఎంపీలకు ప్రథమ చికిత్సపై శిక్షణ ఎంతో అవసరమని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డాక్టర్ మధుసూదన్ రెడ్డి అన్నారు. కమ్యూనిటీ పారామెడిక్స్, ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ (ది పీఎంపీ అసోసియేషన్) జిల్లా సభ్యులకు రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం ఫస్ట్ ఎయిడ్ ట్రైనింగ్ నిర్వహించారు. డాక్టర్ మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ ఎవరికైనా ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు, నిపుణుల వైద్యం అందేవరకూ తాత్కాలికంగా చేసే ఉపయుక్తకరమైన వైద్య విధానమే ఫస్ట్ ఎయిడ్ అన్నారు. ప్రతి ఒక్కరూ ఈ శిక్షణ పొంది అవసరమైన సమయాల్లో రోగుల ప్రాణాలను కాపాడవచ్చన్నారు. డాక్టర్ పరాసర, డాక్టర్ మేఘన ప్రథమ చికిత్సలో పలు అంశాలపై శిక్షణ అందించారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ జిల్లా కో ఆర్డినేటర్ వై.ప్రకాష్, జిల్లా కోశాధికారి బి.సునీల్, మేనేజింగ్ కమిటీ మెంబర్ మహాలక్ష్మి, పీఎంపీ జిల్లా అధ్యక్షుడు బళ్ల శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి పి.దేవానందం, రాజమహేంద్రవరం కార్యదర్శి మట్టా రమేష్, రాజానగరం కార్యదర్శి కాపా సత్యనారాయణ, అనపర్తి కో కన్వీనర్ డి.సాయిరామారెడ్డి పాల్గొన్నారు.



శిక్షణ పొందిన పీఎంపీలు

7న చదరంగం పోటీలు

ప్రకాశం నగర్: జిల్లా చదరంగం సంఘం ఆధ్వర్యంలో స్థానిక గాంధీపురం -3లోని శ్రీ గౌతమి స్మార్ట్ స్కూల్లో ఈనెల 7వ తేదీన అండర్ -17 బాల, బాలికల విభాగంలో జిల్లా స్థాయి చదరంగం పోటీలు నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని సంఘం కార్యదర్శి జీవీ కుమార్ బుధవారం ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ఏపీచెస్.ఓఆర్‌జీ అనే వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. 1-1-2007 తర్వాత జన్మించిన క్రీడాకారులు అర్హులన్నారు. ఈ పోటీల్లో మొదటి స్థానంలో నిలిచిన విజేతలు ఈనెల 21న విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు మన జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. వివరాలకు 98483 74133 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

హర్రర్ విత్ టెర్రర్ సినిమా చిత్రీకరణ

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఇందిరాటి క్రియేషన్స్ పతాకంపై దర్శకుడు వంశీరాజు నిర్మిస్తున్న హర్రర్ విత్ టెర్రర్ సినిమాలోని కీలక సన్నివేశాలను రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాల్లో చిత్రీకరిస్తున్నారు. ఆ వివరాలను దర్శకుడు వంశీరాజు బుధవారం విలేకరులకు తెలిపారు. సస్పెన్స్ థ్రిల్లర్‌గా చిత్రం రూపొందిస్తున్నామన్నారు. ఐదుగురు అమ్మాయిలు ఎదుర్కొన్న సమస్యలు, భయంకరమైన ప్రాంతంలో చిక్కుకున్న వారిని హీరో ఎలా రక్షించాడు వంటి సన్నివేశాలు తెరకెక్కించామన్నారు. దినుష్క హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో ప్రముఖ వర్ధమాన హీరో నటిస్తున్నారన్నారు. నిర్మాతగా టి.రాజు వ్యవహరిస్తుండగా, అనూష, గీత, శృతి, లావణ్య, జబర్దస్త్ నటులు నటిస్తున్నారన్నారు. పోలవరం అడవులు, జగ్గంపేట, రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాల్లో చిత్రీకరణ జరుగుతోందని తెలిపారు. ఉగాది రోజున ప్రముఖ సినీ నిర్మాతలు కల్యాణ్, అశోక్ కుమార్, ప్రసన్నకుమార్, సత్యారెడ్డి, రామ్ సత్యనారాయణ చేతుల మీదుగా ట్రైలర్ విడుదల చేస్తామన్నారు.



సన్నివేశాన్ని వివరిస్తున్న దర్శకుడు వంశీరాజు



డాక్టర్ అనితా శర్మ

ఆమె పోలియో బాధితురాలు.
ఐ.ఐ.ఎం. ఇండోర్‌లో పీహెచ్‌డీ చేసిన విద్యాధికురాలు.
కాని ఆమె తన జీవితాన్ని దివ్యాంగుల కోసం అంకితం చేసింది.
పట్టుదలగా డ్రైవింగ్ నేర్చుకోవడమేగాక
దివ్యాంగులకు డ్రైవింగ్ నేర్పించే స్కూల్ నడుపుతోంది.
ఏయే పరికరాలు అమర్చడం ద్వారా
దివ్యాంగులు సులభంగా డ్రైవ్ చేయవచ్చో తెలుపుతోంది.
'డ్రైవ్ ఆన్ మై ఓన్' సంస్థ నడుపుతున్న
డాక్టర్ అనితా శర్మ గురించి.

కదలండి కదిలించండి

అనితాశర్మకు కారు డ్రైవింగ్ నేర్చుకోవాలనిపించింది. జైపూర్ ఆమెది. జైపూర్‌లో పదిహేను, ఇరవై కాల్స్ చేసింది. ఎవరూ నేర్పించము అన్నారు. ఢిల్లీలో నేర్పుతారేమోనని అక్కడా ఒక పది, ఇరవై కాల్స్ చేసింది. అక్కడా ఎవరూ నేర్పము అన్నారు. కారణం? అనిత కుడికాలుకు పోలియో ఉంది. పోలియోతో బాధ పడుతున్నవారికి, లేదా ఇతర దివ్యాంగులకు కారు డ్రైవింగ్ నేర్పించే తర్ఫీదు డ్రైవింగ్ స్కూల్స్‌కు లేదు. అలా చేయడానికి అవసరమైన మోడిఫైడ్ కార్లు వారి దగ్గర ఉండవు. దివ్యాంగులు చక్రాల కుర్చీకి పరిమితం కావలసిందేనా? వారు తమకు తాముగా బయటకు తిరగకూడదా అనుకుంది అనితా శర్మ.



దివ్యాంగుల కోసం డ్రైవింగ్ క్లాసులు నిర్వహిస్తున్న అనితా శర్మ

తల్లి సహాయంతో...

అనితా శర్మ ఇండోర్ ఐ.ఐ.ఎంలో పీహెచ్‌డీ చేసింది. అమృతసర్ ఐ.ఐ.ఎంలో ప్రొఫెసర్ ఉద్యోగం సంపాదించింది. అయితే ఆమెకు కారు నడపాలన్న కోరిక మాత్రం తీరలేదు. 'మొదట నేను అదనపు చక్రాలు బిగించిన టూ వీలర్ నడిపాను. నా ఆనందానికి అవధుల్లేవు. కారు నడిపితే ఎంత బాగుండో అనిపించింది. హ్యాండ్ కంట్రోల్ ఉండేలా కారును మోడిఫై చేయించి మా అమ్మ సహాయంతో నేర్చుకున్నాను. ఇప్పుడు నేను ఎప్పుడైనా ఎక్కడికైనా నా కారులో ప్రయాణించగలను. నేను కారు నడపడం చూసి చాలా మంది దివ్యాంగులు మాకు నేర్పించవచ్చు కదా అనడిగేవారు. వారి కోసం పని చేయాలనిపించింది. అందుకే నా ఉద్యోగానికి రాజీనామా చేసి 'డ్రైవ్ ఆన్ మై ఓన్' సంస్థ స్థాపించాను. దివ్యాంగులకు కారు డ్రైవింగ్ నేర్పించి, సొంత కారు కొనుక్కోవడంలో అవసరమైన సాయం చేయడమే మా సంస్థ ఉద్దేశం' అంటుందామె.

కస్టమైజ్డ్ కార్లు

అనితాశర్మ సంస్థ దివ్యాంగుల కోసం డ్రైవింగ్ క్లాసులు నిర్వహిస్తుంది. వెబినార్లు, సెమినార్లు నిర్వహిస్తుంది. దివ్యాంగుల కమ్యూనిటీలో ఒకరికొకరికి పరిచయాలు చేసి ప్రోత్సహించుకునేలా చేస్తుంది. శారీరక పరిమితులను అనుసరించి కారులో ఎటువంటి మోడిఫికేషన్ చేస్తే కారు నడపవచ్చో సూచిస్తుంది. ఆ మోడిఫికేషన్ పరికరాలు సమకూర్చడంలో సాయం చేస్తుంది. ఆ తర్వాత కార్ల రిజిస్ట్రేషన్, జీఎస్‌టీ వంటివి దివ్యాంగుల పక్షంలో జరిగేలా చూస్తుంది. 'ఇదంతా చేయడానికి మేము కొంత ఫీజు తీసుకుంటాం. దివ్యాంగులు ఛారిటీ మీద కాకుండా తమ కాళ్ల మీద తాము బతకాలన్నదే నా ఉద్దేశం' అంటుంది అనితా శర్మ.

కుటుంబ సభ్యులు

'దివ్యాంగులు కారు నడపడానికి వారి కుటుంబసభ్యులను ఒప్పించడమే పెద్ద సమస్య. దివ్యాంగులు కారు నడపగలరు. వారిని డ్రైవింగ్ సీట్‌లో స్లయిడర్స్ ద్వారా సులువుగా చేర్చవచ్చు. కాళ్లతో పని లేకుండా చేతులతోనే మొత్తం కంట్రోల్ చేయొచ్చు. వారికి తిరగాలని ఉంటుంది. ధైర్యం చెప్పి సహకరించి తిరగనివ్వండి' అని సూచిస్తోంది అనితా శర్మ.

న్యూస్ మేకర్



సంపన్న కుటుంబ నేపథ్యం లేని మిక్కీ జగ్తియాని
'ల్యాండ్‌మార్క్'తో ఒక్కోమెట్టు ఎక్కుతూ
ప్రపంచ కుబేరుల సరసన నిలిచాడు.
భర్త అడుగు జాడల్లో నడిచి వ్యాపార నైపుణ్యాన్ని
సొంతం చేసుకున్న రేణుకా జగ్తియాని
'ల్యాండ్ మార్క్'కు తనదైన మార్క్ జోడించి
ఆ వ్యాపార సామ్రాజ్యాన్ని మరింత విస్తరించింది.
తాజాగా... ఫోర్బ్స్ న్యూ బిలియనీర్స్
2024 జాబితాలో చోటు సాధించింది.

విజయాలకు ల్యాండ్ మార్క్

రేణుకా జగ్తియాని నేతృత్వంలోని దుబాయ్ చెందిన రిటైలింగ్ దిగ్గజం 'ల్యాండ్‌మార్క్' 21 దేశాలలో పాదరక్షల నుంచి గృహోపకరణ వస్తువుల వరకు వివిధ బ్రాండ్‌లతో విజయపథంలో దూసుకుపోతుంది.

హాస్పిటాలిటీ బిజినెస్‌లో కూడా గెలుపు జెండా ఎగరేసింది. ఎప్పటికప్పుడు కొత్త ప్రణాళికలతో ముందుకువెళ్లే రేణుక మిడిల్ ఈస్ట్, ఇండియా, ఆగ్నేయాసియాలోని కీలక మార్కెట్లలో రాబోయే కాలంలో వందలాది స్టోర్‌లను ప్రారంభించాలని లక్ష్యంగా నిర్ణయించుకుంది.

ఎలాంటి వ్యాపార అనుభవం లేని రేణుక 1993లో ల్యాండ్‌మార్క్ గ్రూప్‌లోకి అడుగు పెట్టింది.

'ఇది సాధ్యమా!' అనుకునే వాళ్ల సందేహాల దగ్గరే తచ్చాడుతారు.

'కచ్చితంగా సాధ్యమే' అనుకునే వాళ్లు ముందుకు దూసుకుపోతారు.

రేణుక రెండోకోవకు చెందిన మహిళ. వేగంగా వ్యాపార నైపుణ్యాన్ని అందిపుచ్చుకోవడమే కాదు ఫాస్ట్-ఫ్యాషన్ బిజినెస్ 'స్ప్లాష్'తో తనదైన ముద్ర వేసింది. 'స్ప్లాష్' పదకొండు దేశాలలో 200 స్టోర్స్ వరకు విస్తరించింది. మన దేశంలో 1999లో లైఫ్‌స్టైల్, హోమ్ సెంటర్ అండ్ మాక్స్‌లాంటి అయిదు ఫార్మట్స్‌లో ప్రస్థానం ప్రారంభించి 900 స్టోర్స్‌లో విస్తరించింది ల్యాండ్‌మార్క్.

2017లో రేణుక ల్యాండ్ మార్క్ గ్రూప్ చైర్‌పర్సన్, సీయీవోగా బాధ్యతలు స్వీకరించింది.

రేణుక భర్త మిక్కీ జగ్తియాని సౌత్ ఆఫ్రికా ఇమిగ్రెంట్స్‌ను దృష్టిలో పెట్టుకొని బహ్రెయిన్‌లో బేబీ ప్రొడక్ట్స్ స్టోర్‌ను మొదలుపెట్టాడు. అక్కడినుంచి ప్రారంభమైన బుడి బుడి అడుగుల వ్యాపారం 'ల్యాండ్ మార్క్' రూపంలోఎక్కడికో వెళ్లింది.

భర్త నిర్మించిన వ్యాపార సామ్రాజ్యాన్ని చెక్కుచెదరకుండా నిలబెట్టడం అంత సులువు కాదు. కాని ఎక్కడా రేణుక వెనకడుగు వేయలేదు. అయితే ప్రపంచంలోని ఎన్నో కంపెనీలపై పడినట్లే కోవిడ్ సంక్షోభ ప్రభావం 'ల్యాండ్ మార్క్' పై పడింది. రెండు నెలలకు పైగా స్టోర్స్ అన్నీ క్లోజ్ అయిపోయాయి. ఆ తరువాత మెల్లమెల్లగా కొత్త గైడ్‌లైన్స్‌తో తెరుచుకోవడం మొదలైంది.

భర్త అడుగుజాడల్లో నడిచి, వ్యాపారనైపుణ్యాన్నే కాదు సేవా దృక్పథాన్ని సొంతం చేసుకున్న రేణుకా జగ్తియాని వ్యాపారంతోపాటు సేవా కార్యక్రమాలకు కూడా ప్రాధాన్యత ఇస్తోంది.

'విపత్కరమైన పరిస్థితుల్లో ఆపరేషనల్ ప్రాసెస్‌లో ర్యాపిడ్ ఛేంజెస్ చేశాము. ఉద్యోగుల ఆరోగ్యంపై దృష్టి పెట్టాం. క్వారంటైన్‌లో ఉన్న ఉద్యోగులు లేదా వారి కుటుంబ సభ్యులకు అవసరమైన సహాయం అందించాం, వారిలో ధైర్యం నింపాం. ఆఫీస్, స్టోర్ ఉద్యోగుల కోసం ప్రత్యేక వసతి ఏర్పాటు చేశాం. ఉద్యోగుల కోసమే కాదు కోవిడ్ బాధితుల కోసం మా ఫౌండేషన్ తరపున ఎన్నోరకాల సేవాకార్యక్రమాలు చేపట్టాం' అంటూ ఆ రోజులను గుర్తు తెచ్చుకుంటుంది రేణుక.

చిన్న వ్యాపారంగా మొదలైన 'ల్యాండ్ మార్క్' గల్ఫ్‌కు సంబంధించి 'కింగ్ ఆఫ్ రిటైల్'గా పేరు తెచ్చుకుంది.

విజయపథంలో దూసుకుపోతున్న 'ల్యాండ్‌మార్క్' ముందున్న కర్తవ్యం... సమాజానికి తిరిగి ఇవ్వాలి. ఆదరించిన ప్రజలకు అండగా ఉండాలి. పర్యావరణ సంరక్షణ కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తున్న ల్యాండ్ మార్క్ గ్రూప్ చెన్నై, ముంబై మురికివాడల్లో రకరకాల సేవాకార్యక్రమాలు చేపడుతోంది.

రేణుక జగ్తియాని భర్త మిక్కీ జగ్తియాని 71 సంవత్సరాల వయసులో చనిపోయారు. కొన్ని సంవత్సరాల క్రితం ఒక రిపోర్టర్ ఆయనను 'మీ నెక్ట్స్ ప్లాన్ ఏమిటి?' అని అడిగాడు. దీనికి మిక్కీ జగ్తియాని చెప్పిన జవాబు...

'నా గురించి నేను పూర్తిగా తెలుసుకోవడానికి ఎక్కువ సమయం గడపాలనుకుంటున్నాను. వ్యాపార సంబంధిత విషయాల గురించి కాకుండా నేనెవరిని? జీవితపరమార్థం ఏమిటి? లాంటి విషయాల గురించి ఆలోచిస్తుంటాను. వ్యాపార లాభాలే కాదు జీవితానికి సంబంధించిన ఎన్నో అంశాలలో ఆనందం దొరుకుతుంది'

భర్త అడుగుజాడల్లో నడిచి, వ్యాపార నైపుణ్యాన్నే కాదు సేవాదృక్పథాన్ని సొంతం చేసుకున్న రేణుకా జగ్తియాని వ్యాపారంతో పాటు సేవాకార్యక్రమాలకు కూడా ప్రాధాన్యత ఇస్తోంది.

బటర్‌ఫ్లై మామ్

ఇల్లంటే ఎలా ఉండాలి? ఇంటి ముందు గుమ్మానికి ఆకుపచ్చ తోరణం ఉండాలి. గుమ్మానికి ఇరువైపులా పచ్చటి మొక్కలుండాలి. ఆ మొక్కలకు రంగురంగుల పువ్వులుండాలి. ఇంట్లోకి అడుగుపెడుతుంటే పరిమళాలు స్వాగతం పలుకుతుండాలి. ఇవన్నీ ముంబయి నగరంలో, మల్టీ స్టోరీడ్ బిల్డింగ్‌లో సాధ్యమయ్యే పనేనా? సాధ్యం కాదని ఊరుకుంటే ప్రియాంక సింగ్ బటర్‌ఫ్లై మామ్ అయ్యేదే కాదు. ఆమె ఇల్లు వేలాది సీతాకోక చిలుకలకు పుట్టిల్లయ్యేదీ కాదు.

ప్రియాంక సింగ్‌ది ఉత్తరప్రదేశ్‌లోని వారణాసి పట్టణం. గంగానది తీరాన, వందల ఏళ్ల నాటి మహావృక్షాల నీడన పెరిగిన బాల్యం ఆమెది. చదువు, ఉద్యోగం, పెళ్లి... ఆమె గమ్యాన్ని నిర్దేశించాయి. ముంబయిలో అడుగు పెట్టింది. ఆమె ఫ్లాట్ ఆ భవనంలో పదమూడవ ఫ్లోర్‌లో ఉంది. తాను గడిపిన అందమైన బాల్యం తన పిల్లలకు ఉండదని దిగులు పడిందామె. మహావృక్షాల నీడన కాకున్నా, కనీసం అడుగు ఎత్తు మొక్కల మధ్య పెరిగినా చాలనుకుంది. బాల్కనీలో రకరకాల మొక్కలు పెంచింది. మొక్కలను సేంద్రియ పద్ధతిలో పెంచాలనుకోవడమే ఆమెకు తెలియకుండా ఆమె చేసిన ఓ మంచిపని. మొక్కలకు చీడపీడలకు రసాయన క్రిమిసంహారక మందులు వాడకుండా సేంద్రియాలతో పెంచింది. ఒకరోజు ఒక లార్వా ఆమె మొక్కల ఆకుల కింద కనిపించింది. రోజుల్లోనే అది ప్యూపా దశకు చేరడం, ఆ తర్వాత రంగురంగుల సీతాకోక చిలుక రెక్కలు విచ్చుకుని ఎగరడం అన్ని దశలూ చూస్తుండగానే జరిగిపోయాయి. అప్పటి నుంచి ఆమె సీతాకోక చిలుకల పరిణామక్రమాన్ని చదవడం మొదలు పెట్టింది. ఆ తర్వాత రసాయన క్రిమిసంహారిణులను ఇంట్లోకి తీసుకురావడమే మానేసింది. ఇప్పుడామె బాల్కనీలో నిమ్మజాతి చెట్లు, అక్షింతల చెట్లు, కరివేపాకు, వెస్ట్ ఇండియన్ జాస్మిన్... వంటి మొక్కలున్నాయి. వాటి మీద మోనార్క్ బటర్‌ఫ్లై, కామన్ జాయ్, లైమ్ స్వాలోటెయిల్ వంటి అరుదైన జాతుల సీతాకోక చిలుకలు కనిపిస్తున్నాయి. అలా వచ్చి వెళ్లిపోకుండా ఆ చెట్ల ఆకుల మీదనే గుడ్లు పెడుతున్నాయి. సంతతిని వృద్ధి చేస్తున్నాయి. ఆమె ఇంట్లో సీతాకోక చిలుకలకు అనువైన వాతావరణం ఉంది. ఆ వాతావరణాన్ని పరిరక్షిస్తోందామె. అందుకే ప్రియాంక సింగ్‌ను బటర్ ఫ్లై మామ్ అంటున్నారు ఆమె స్నేహితులు. తాను జీవవైవిధ్యత కోసం అంకితమవుతానని వారణాసి నుంచి ముంబయికి పయనమైనప్పుడు కలలో కూడా ఊహించలేదు... అంటుంది ప్రియాంక సింగ్. ఆమెకు సీతాకోక చిలుకలను చూస్తూ తేడాలను గుర్తించడంతో పాటు ప్రతి సీతాకోక చిలుకనూ ఫొటో తీయడం అలవాటైంది. ఇప్పటివరకు ఆమె మినీ గార్డెన్‌లో ఐదు వేలకు పైగా సీతాకోక చిలుకలు కొలువుదీరాయి. రెక్కలొచ్చిన తర్వాత ఎగిరి వెళ్లిపోయాయి.





ప్రియాంక సింగ్



విపుల్ వర్షిణే

'కోరుకున్న రంగంలో రాణించాలంటే
మనలో ఒక తపన ఉండాలి.
ఒక తపస్సులా ఆ రంగాన్ని స్వీకరించాలి.
ఎన్ని అడ్డంకులు ఎదురైనా ఎదుర్కోడానికి
సిద్ధంగా ఉండాలి' అంటారు
ఐదు పదుల వయసు దాటిన విపుల్ వర్షిణే.
లక్నోవాసి అయిన విపుల్ వర్షిణే ముప్పైఏళ్లుగా
ఆర్కిటెక్చర్ రంగంలో తనదైన ముద్ర వేస్తూ,
గుర్తింపు పొందారు.
ఒక్కరూ తన మాట వినడం లేదు అనే నిరాశ నుంచి
రెండు విమానాశ్రయాల రూపకల్పన చేసేంత
స్థాయికి ఎదిగారు.
విపుల్ వర్షిణే తనను తాను శక్తిగా మలుచుకున్న విధానం
నేటి మహిళలకు స్ఫూర్తిని కలిగిస్తుంది.

ఎదుర్కోడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉండాలి

'నా పేరు విపుల్ అనే ఉండటంతో మగ ఆర్కిటెక్ట్ అనుకుని, సంప్రదించేవారు. నేను మహిళను అని తెలిసి వర్క్ ఇవ్వడానికి వెనకడుగు వేసేవారు. ఇప్పుడు ఈ పరిస్థితుల్లో కొంతమార్పు చూస్తున్నాను కానీ, 30 ఏళ్ల క్రితం నేను ఆర్కిటెక్ట్ అని చెబితే చాలామంది ఆశ్చర్యపోయేవారు. ఇప్పుడు నేను రెండు విమానాశ్రయాలను డిజైన్ చేసే స్థాయికి ఎదిగాక ఈ రంగంలో అమ్మాయిలూ రాణించగలరు అనే స్పష్టత వచ్చింది. ఈ విషయాన్ని నిరూపించడానికి నేను చేసిన ప్రయత్నం ఆషామాషీ కాదు.

సృజనతో అడుగు

పుట్టి, పెరిగింది లక్నోలో. స్కూల్ ఏజ్ నుంచి పెయింటింగ్స్ వేయడం, కార్టూన్స్ గీయడం వంటివి చూసి వాటిని పత్రికలకు పంపించే వారు నాన్న. మొదట నేను మెడిసిన్ చదవాలని కోరుకున్న మా నాన్న నాలోని సృజనాత్మకత చూసి ఆర్కిటెక్ట్ ఇంజినీరింగ్ చేయమని సలహా ఇచ్చారు. ఎందుకంటే ఆర్కిటెక్చర్ సైన్స్, సృజనాత్మకతల సమ్మేళనంగా ఉంటుంది. మా నాన్న మనసులో నేను గవర్నమెంట్ ఉద్యోగం చేయాలని, అది నాకు సురక్షితమైనదని భావించేవారు. నేను ఎంచుకున్న రంగం చాలా శ్రమతో కూడుకున్నదని ఆయనకు తెలియదు. అప్పట్లో కంప్యూటర్లు లేవు కాబట్టి రాత్రంతా డ్రాయింగ్ బోర్డ్ పైనే పని చేయాల్సి వచ్చేది.

ఎవరూ సీరియస్‌గా తీసుకోలేదు..

''నేను ఆర్కిటెక్చరల్ ఇంజినీరింగ్ చదువుతున్నప్పుడు మా క్లాస్‌లో ముగ్గురం మాత్రమే అమ్మాయిలం. ఈ వృత్తిలో అబ్బాయిలదే ఆధిపత్యమని అప్పుడు అర్థమైంది. కాలేజీలో చదివే సమయంలోనే పెళ్లి అయ్యింది. మావారు సివిల్ ఇంజినీర్ కాబట్టి పెళ్లయ్యాక ఆయనతోనే కెరీర్ ప్రారంభించాను. భవనాలు కట్టే లొకేషన్‌కు వెళ్లేటప్పుడు నాతో మాట్లాడేందుకు కూలీలు తడబడేవారు. మేస్త్రీలు నా మాటలను అస్సలు పట్టించుకునేవారు కాదు. ఒక మహిళ యజమానిగా మారడం వారెవరికీ ఇష్టం ఉండదని అప్పుడు అర్థమైంది. అసలు నన్ను వారు నిర్మాణశిల్పిగా అంగీకరించలేదు. నిరాశగా అనిపించేది. కానీ, నా డిజైన్ ప్రకారమే పనిచేయాల్సి ఉంటుందని నా నిర్ణయాన్ని సున్నితంగానూ, అంతే కచ్చితంగానూ తెలియజేశాను. అక్కడ నుంచి ఆర్కిటెక్ట్‌గా ఎదగడానికి నన్ను నేను మార్చుకుంటూ వెళ్లాల్సి వచ్చింది. ఆఫీస్‌లో నాకు, నా భర్తకు విడివిడిగా క్యాబిన్లు ఉండేవి. క్లయింట్స్ వచ్చినప్పుడల్లా నా సలహా తీసుకోవాలని నా భర్త తరచూ వారికి చెప్పాల్సి వచ్చేది. తీసుకున్న ప్రాజెక్ట్ పూర్తి చేయడం పట్ల పూర్తి శ్రద్ధ పెట్టేదాన్ని. కానీ వచ్చిన వాళ్లు మాత్రం 'మిస్టర్ విపుల్ వర్షిణే ఎప్పుడు వస్తారు' అని అడిగేవారు. నేనే విపుల్ అని, ఆర్కిటెక్ట్ అని తెలిసి ఆశ్చర్యపోయేవారు.

200 భవనాల జాబితా

భవన నిర్మాణంలో నా వర్క్‌ని కొనసాగిస్తూనే లక్నోలోని చారిత్రక కట్టడాలపై, వాటి పరిరక్షణ గురించి ప్రాజెక్ట్ వర్క్ చేశాను. అక్కడి వారసత్వ కట్టడాల పట్ల ఎలాంటి జాగ్రత్తలూ తీసుకోవడం లేదని తెలుసుకొని దాదాపు 200 భవనాల జాబితాను తయారు చేశాను. ఆ జాబితాను పురావస్తు శాఖకు అప్పగించాను. ఆ సమయంలోనే 500 పేజీల ఆ ప్రాజెక్ట్ వర్క్‌ని పుస్తకంగా తీసుకువస్తే ప్రయోజనకరంగా ఉంటుందన్న సన్నిహితుల సలహాతో బుక్‌గా తీసుకువచ్చాను. అలా రచనా ప్రపంచంలోకి అడుగుపెట్టాను. ఇప్పటి వరకు మన దేశ వారసత్వ సంపదపైన ముఖ్యంగా లక్నో సంస్కృతి, వారసత్వ నగరం, చరిత్ర ద్వారా నడక, మ్యూజింగ్స్ ఇన్ బెనారస్, ఎ కెలిడోస్కోప్ ఆఫ్ ది హార్ట్, లక్నో ఎ ట్రెజర్ పేర్లతో 5 పుస్తకాలు ప్రచురితమయ్యాయి. ఇటీవలే అయోధ్యకు సంబంధించి ఎ వాక్ త్రూ ది లివింగ్ హెరిటేజ్ ప్రచురితమైంది.

'షామ్ ఎ అవధ్ పుస్తకంలో లక్నో సంస్కృతిపై స్కెచ్‌లు కూడా వేశాను. లక్నోలోని చికంకారీ ఎంబ్రాయిడరీ, ఈ నగరంలోని వీధులు, మార్కెట్ల గురించి ప్రస్తావించాను. లక్నో ఇన్‌టాక్‌కి కన్వీనర్‌గా ఉన్నాను.

లేహ్ విమానాశ్రయం .. ఓ సవాల్!

2018లో లేహ్ ఎయిర్‌పోర్ట్ డిజైన్ చేసే అవకాశం వచ్చింది. ఈ ప్రాజెక్ట్ నాకు అత్యంత సవాల్‌గా ఉండేది. ఎందుకంటే అక్కడ భూమి, పర్యావరణం చాలా భిన్నంగా ఉంటాయి. పర్వతాల కారణంగా భూభాగం చాలా తేడాగా ఉంటుంది. విమానాశ్రయం అరైవల్, డిపార్చర్ లాంజ్‌ల మధ్య 3 అంతస్తుల వ్యత్యాసం ఉంది. అక్కడ లగేజీ బెల్ట్ రివర్స్ చేయాల్సి వచ్చింది. ఉష్ణోగ్రత చాలా తక్కువ కాబట్టి, ఎయిర్ కండీషనర్లలో ఉపయోగించే ద్రవం ఘనీభవన స్థానం కంటే తక్కువగా ఉంది. అలాంటప్పుడు ప్రత్యేక రసాయనాలను ఉపయోగించి, దానిని ఏర్పాటు చేశాను. లేహ్‌లో అనేక బౌద్ధ విహారాలు ఉన్నాయి. ప్రవేశం ద్వారం వద్ద 30 అడుగుల ఎత్తైన బుద్ధుని విగ్రహాన్ని ఉంచాను. అక్కడి స్థానిక సంస్కృతి, కళ, హస్తకళలను దృష్టిలో ఉంచుకుని రంగు రంగుల వలలు, ప్రార్థన చక్రాలను ఏర్పాటు చేయించాను. అయోధ్య విమానాశ్రయం పని ప్రారంభించినప్పుడు అక్కడ మహంతులు, సాధువులను కలుస్తూ ఉండేదాన్ని. ఎందుకంటే అక్కడి నిర్మాణాన్ని బాగా అర్థం చేసుకోవాలి, సరైన సమాచారం కోసం చాలా పుస్తకాలు చదివాను. వివిధ వృత్తులలో ఉన్న వ్యక్తులతో మాట్లాడాను. దీంతో అయోధ్యపై నాకు ఆసక్తి పెరుగుతూ వచ్చింది. ఆ తర్వాత దానినే పుస్తకంగా తీసుకు వచ్చాను.

ఒక సృజనాత్మక వ్యాపకం నన్నూ నా దిశను మార్చింది. సవాల్‌గా ఉన్న రంగంలో సమున్నతంగా నిలబడేలా చేసింది. ఏ రంగం ఎంచుకున్నా అందులో మనదైన ముద్ర తప్పక వేయాలి. అప్పుడే, ఎక్కడ ఉన్నా సరైన గుర్తింపు లభిస్తుంది' అని వివరిస్తారు విపుల్ వర్షిణే.

బ్యూటిప్స్

పెడిక్యూర్ సింపుల్‌గా

పాదాలు అందంగా ఆరోగ్యంగా ఉండాలంటే చర్మం మీద మృత కణాలు తొలగించడం ప్రధానం. ఇంట్లోనే చేసుకోగలిగిన సింపుల్ పెడిక్యూర్ చేసుకునేటప్పుడు ఒక జాగ్రత్త తప్పనిసరిగా పాటించాలి. పాదాలను శుభ్రం చేయడానికి వాడే పమిస్ స్టోన్ మరీ పాతదై పోయి స్టోన్ రంధ్రాలు మురికితో నిండినప్పటికీ కొందరు దానినే ఉపయోగిస్తుంటారు. అది అసలు మంచిది కాదు. దాని వల్ల చర్మం మీదున్న మృతకణాలు తొలగక పోగా ఇతర ఇన్‌ఫెక్షన్‌లు వచ్చే ప్రమాదం ఉంటుంది.



- గోరు వెచ్చటి నీటిలో రెండు చుక్కలు లిక్విడ్ సోప్ లేదా షాంపూ వేసి కలిపి అందులో పాదాలను పది నిమిషాల సేపు ఉంచాలి. ఆ తర్వాత పాదాలను, వేళ్లను పమిస్ స్టోన్ లేదా ఫుట్ ఫైలర్‌తో రుద్ది శుభ్రం చేయాలి.
- పాదాలను పొడి వస్త్రంతో తుడిచి మాయిశ్చరైజర్ లేదా బాడీ క్రీమ్ రాయాలి.
- క్రీమ్ రాసిన తర్వాత పాదాలకు, వేళ్లకు మర్దన చేయాలి. ఇలా చేయడం వల్ల పాదాలు అలసట తొలగి సాంత్వన పొందుతాయి. రక్త ప్రసరణ మెరుగవడంతో పాదాల నొప్పులు, పాదాల కండరాలు పట్టేయడం వంటి సమస్యలు కూడా తగ్గుతాయి.